పాలకొండకు దసరా శోభ

ప్రారంభమైన సామూహిక సంబరాలు


ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోట దుర్గమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పట్టణంలోని నవోదయ నగర్, గాయత్రీనగర్, నక్కలపేట, షిర్డీసాయినగర్, వెంకంపేట, శెగిడివీధి తదితర ప్రాంతాల నుంచి భారీగా మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు కళింగ వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సీఐ ఎం. చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు దంపతులు, విజయనగరం జిల్లా ప్రత్యేక కోర్టు జడ్జి నాగమణి దర్శించుకున్నారు.


ఘటాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


అమ్మవారి ఆలయంలో కిక్కిరిసిన క్యూలైన్లు

తల్లి పండక్కి రారండహో..

సంప్రదాయబద్ధంగా పైడితల్లి ఉత్సవ చాటింపు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడిమాంబ పండగ చాటింపు ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు చదురుగుడి వద్ద సంప్రదాయబద్ధంగా జరిగింది. ముందుగా ఆలయ సహాయ కమిషనర్ ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. పైడితల్లికి ఎంతో ప్రీతిపాత్రమైన వేప చెట్టు వద్ద ఉన్న చెక్క బొమ్మలను గర్భగుడిలో పెట్టి పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ తలయారీ రామవరపు చినపైడిరాజు, మరికొంత మంది కుటుంబీకులు తల్లి సిరిమాను సంబరం 15న జరుగుతుందని అమ్మవారి గర్భగుడిలో, ఆలయ ప్రధాన మెట్లపై చాటింపు వేశారు. ఇక్కడి నుంచి బంధువులు, స్నేహితులకు పండగ పిలుపులు ప్రారంభించుకోవచ్చని పైడిరాజు ప్రకటించారు.



చదురుగుడి మెట్టు మీద చాటింపు వేస్తున్న తలయారి చినపైడిరాజు, పాల్గొన్న అధికారులు

మారుమూల గ్రామాల్లో.. మెరుగైన వైద్యం

కొమరాడ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా మార్పుచేస్తూ జీవో విడుదల చేసింది. ఇక్కడ 105 రకాల మందులతో పాటు 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. 66 రకాల వైద్య పరికరాలు అందిస్తారు. ఆరోగ్య కార్యకర్త, సీహెచ్‌వో, ఆశా కార్యకర్తల బృందంగా విధులు నిర్వర్తిస్తారు. ఏఎన్ఎం పాత్ర కీలకంగా మారనుంది. ఒకప్పుడు గ్రామీణులు రోగ నిర్ధారణ పరీక్షలకు పీహెచ్‌సీలు, జిల్లా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేవారు. ఇకపై ఆరోగ్య మందిరాల్లో 14 రకాల నిర్ధారణ పరీక్షలు చేసి టెలీ మెడిసిన్ ద్వారా వైద్యుల సలహాతో మందులు ఇస్తారు. రక్తహీనత, హిమోగ్లోబిన్, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటి బారిన పడితే గ్రామంలోనే చికిత్స పొందవచ్చు.


తులసివలస ఆరోగ్య ఉప కేంద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 37
ఆరోగ్య ఉప కేంద్రాలు: 350
పట్టణ ఆరోగ్య కేంద్రాలు: 05



స్వర్ణాలంకరణలో కామాక్షి అమ్మవారు

సాలూరులోని శ్రీకామాక్షి అమ్మవారు ఆదివారం స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లు, నాణేలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

పాపం.. తోటపల్లి

తోటపల్లి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి విజయనగరం జిల్లా సస్యశ్యామలం అవుతుంది. కానీ ఏళ్లుగా పనులు ముందుకు కదలక పోవడంతో అన్నదాతలు వరుణుడి కరుణపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏటా దీని పరిధిలోని పొలాలు ఎండిపోయి అప్పులే మిగులుతున్నాయి. గత అయిదేళ్లలో ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో పెద్దగా పురోగతి లేదనే చెప్పాలి.

పార్వతీపురం, న్యూస్‌టుడే

తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోటపల్లిని ప్రాధాన్య ప్రాజెక్టుల్లో గుర్తించారు. సాగునీరు విడుదల చేయాలన్న లక్ష్యంతో పనులు పరుగులు పెట్టించారు. అవసరమైన ప్రతి పనికీ నిధులు కేటాయించడంతో 2016 నాటికి సాగునీరు విడుదలైంది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత పనులు రద్దు చేయడంతో ప్రాజెక్టు పరిస్థితి పడకేసింది.

అయిదేళ్లలో 18 శాతమే

2019లో పనులు రద్దు చేసిన వైకాపా ప్రభుత్వం మళ్లీ కొన్నాళ్లకు రెండు ప్యాకేజీలుగా మంజూరు చేసింది.

- ప్యాకేజీ-1 కింద రూ.59.58 కోట్లు కేటాయించారు. వీటితో తోటపల్లి డివిజను పరిధిలోని ఉల్లిభద్ర కుడి ప్రధాన కాలువ ప్రారంభం నుంచి పనులు నిర్వహించాల్సి ఉంది.
- మట్టికట్ట బలోపేతం చేయాలి. నది ప్రవాహ ప్రాంతంలో రెండు వైపులా వరద కట్ట కోతకు గురి కాకుండా చూడాలి.
- మట్టికట్టపై విద్యుద్దీపాలు, గ్యాలరీ గోడ బాగు చేయాలి.
- 20,521 ఎకరాలకు సాగునీరు అందేలా 9 ఓటీ స్లూయిస్‌లు నిర్మించాలి. దీని కింద 540 స్ట్రక్చర్లు నిర్మించాలని భావించారు. కానీ ప్యాకేజీ-1లో చేపట్టిన పనుల్లో 18 శాతం మాత్రమే జరిగాయి.

ప్యాకేజీ-2దీ అదే పరిస్థితి

రెండో ప్యాకేజీ కింద చీపురుపల్లి, రాజాం, విజయనగరం ప్రాంతాల్లో పనులు చేయాలని నిర్ణయించి రూ.63.63 కోట్లు మంజూరు చేశారు.

- ఈ నిధులతో తోటపల్లి ప్రధాన కాలువ మైలురాయి 48.88 కిలోమీటరు నుంచి 117.89 కిలోమీటరు వరకు పనులు చేయాల్సి ఉంది. ఈ పరిధిలో 4 బ్రాంచి కాలువలు, 29 డిస్ట్రిబ్యూటరీలు, 7,811 స్ట్రక్చర్లు నిర్మించాలి. వీటిలో 6 వేల వరకు పనులు చేశారు. కొన్ని చోట్ల పిల్ల కాలువలను తవ్వాల్సి ఉంది. ఈ పనులు కూడా 25 శాతం లోపే జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం 25 శాతం లోపు పనులు ఆపాలని సూచించడంతో ప్యాకేజీ 1, 2 పనులపై ప్రభావం పడింది.


గట్టుకు లైనింగ్ పనుల పరిస్థితి ఇదీ

అవసరంపై నివేదిక ఇస్తాం

పనుల ప్రగతి 25 శాతం లోపు ఉంటే నిలిపివేయాలని ప్రభుత్వం సూచించింది. తోటపల్లి ప్రాజెక్టు పనులు కొనసాగించాల్సిన అవసరం చాలా ఉంది. దీనిపై ప్రత్యేక నివేదిక అందజేస్తే తిరిగి మంజూరు వస్తాయని తోటపల్లి డివిజను కార్యాలయ ఇంజినీరింగ్ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

గత సర్కారు నిర్లక్ష్యంతో బాలారిష్టాలు


తోటపల్లి జలాశయం

నిధులు అవసరం

ఇక ఆయకట్టు 1,31,221 ఎకరాల్లో సుమారు 64 వేల ఎకరాలకు ఏటా సాగునీరు అందించడం గగనం అవుతోంది. ఇంత వరకు ఈ ప్రాజెక్టు కింద రూ.867.79 కోట్లు వెచ్చించారు. మిగిలిన పనులు పూర్తి చేసే నాటికి దీని వ్యయం 1,127.58 కోట్లకు చేరుతుంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట కాల్వలు బలహీనపడిన ఆరేడు చోట్ల గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతులకు రూ.కోటి అవసరం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తోటపల్లి ప్రాజెక్టుకు తక్షణం రూ.6 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 118 కి.మీ ప్రధాన కాలువ పనులు ఈ అయిదేళ్లు ఎక్కడా చేపట్టలేదు. ఎక్కడికక్కడ షట్టర్లు సైతం బలహీనమయ్యాయి. వీటి బలోపేతానికి రూ.4 కోట్లు ఇవ్వాలని అధికారులు కోరారు. 'ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను బట్టి త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. వాటితో వచ్చే ఖరీఫ్‌నకు పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు ప్రయత్నిస్తామని' ఈస్ట్‌కోస్ట్ జల వనరుల శాఖ ఎస్ఈ ఎస్.సుగుణాకరరావు తెలిపారు.

ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభం

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు. భామిని మండలం కాట్రగడ-బి వద్ద రేవు, వంశధార ప్రాజెక్టు సమీపంలో నిల్వ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రేవు నుంచి 1.05 లక్షల టన్నుల ఇసుక ఉచితంగా పంపిణీ చేయడమే లక్ష్యమన్నారు. నిర్వహణ ఖర్చుల కింద టన్నుకు రూ.182, పన్ను రూ.88 చెల్లించాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. నేరడిలో 1000 టన్నుల ఇసుకను జప్తు చేశామని, తవ్వకాలకు వినియోగిస్తున్న 12 లారీలు, 2 పొక్లెయిన్లు, 2 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని రూ.4 లక్షల అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. అక్రమ రవాణాదారులపై పాలకొండ ఠాణాలో రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

నీటి కలుషితంతోనే అతిసారం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలం విశ్వనాథపురంలో ఇటీవల అతిసారం బారినపడిన బాధితులు, రక్షిత పథకం నుంచి నమూనాలు సేకరించి వైద్యులు ల్యాబ్‌కు పంపించారు. పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితం కావడంతో అతిసారం ప్రబలిందని వైద్యశాఖ నిర్ధారించడంతో సరఫరాను నిలిపివేశారు. ఆదివారం ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా 15 వేల లీటర్ల సామర్థ్యమున్న రెండు ట్యాంకుల ద్వారా అందించారు. రక్షిత పథకం నుంచి పునరుద్ధరించే వరకు ట్యాంకుల ద్వారా గ్రామస్థులకు నీటిని సరఫరా చేయనున్నట్లు ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు తెలిపారు.


ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

ఉపాధ్యాయులదే గురుతర బాధ్యత

'రోజురోజుకూ ఉపాధ్యాయుడి బాధ్యత పెరగాలి. తరగతి గదిలో పాఠానికి పరిమితం కాకుండా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను నిర్వర్తించాలి' - **వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ**

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు విజయనగరం ఫూల్‌బాగ్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు గురుతర బాధ్యత నిర్వర్తించాలని వక్తలు పిలుపునిచ్చారు. దివంగత మార్పు బాలకృష్ణమ్మ వేదికగా ప్రారంభ సమావేశం, మధ్యాహ్నం చెన్నుపాటి లక్ష్మయ్య వేదికపై విద్యా సదస్సును నిర్వహించారు.


ఏపీటీఎఫ్ సావనీర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అదితి తదితరులు

ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని, ఉపాధ్యాయులకు స్వేచ్ఛగా పాఠం చెప్పేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు 117 జీవో రద్దు చేస్తామని, 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కలుపుతున్నట్లు పేర్కొన్నారు. గురువుకు సమాజంలో సముచిత స్థానం ఉందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. ఒక పాఠశాల ఉపాధ్యాయినిగా తాను రెండేళ్లు పనిచేసిన తర్వాత రాజకీయ బాధ్యత అప్పగించినందున ఇష్టమైన వృత్తిని వదులుకోవాల్సి వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ అభిమానినని, ఆయన అడుగు జాడల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ ద్వారా ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బు ఇచ్చేలా చూడాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, సహాధ్యక్షుడు దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షులు టి.దస్తగిరి, ఎ.విశ్వనాథరెడ్డి, డి.ఈశ్వరరావు, ఎం.వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రఫీక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామ్‌నాయుడు, ఎన్.వి.పైడిరాజు పాల్గొన్నారు.


కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

మన ఇంటిపైనే సూర్యుడు



పీఎం సూర్యఘర్‌లో సోలార్ ఏర్పాటు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పీఎం సూర్యఘర్ పథకం.. ఎస్సీ, ఎస్టీల ఇళ్లలో వెలుగులు నింపనుంది. అర్హులైన లబ్ధిదారులకు ఏపీఈపీడీసీఎల్ యూనిట్లు మంజూరు చేయనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేశారు. అందులో భాగంగా గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేపట్టారు.

వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సదుపాయం ఉంది. ప్రస్తుతం వారు నివాసం ఉంటున్న ఇళ్లకు ఏ మేరకు సౌర ప్లాంటు అవసరం ఉందో తెలుసుకుంటున్నారు. అర్హత కలిగిన వారి వివరాలు సేకరిస్తున్నారు. పాక, పెంకుటిల్లు ఉంటే అనర్హులుగా గుర్తిస్తున్నారు.

సర్కిల్	ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు	సర్వే జరిగింది	శాతం
విజయనగరం	50,685	38,641	76.24
పార్వతీపురం	73,338	31,217	42.57


రాజాంలో సర్వే నిర్వహిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

ఇప్పటికే ఈపీడీసీఎల్ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్లాంటు ఏర్పాటుకు గల అవకాశాలు, వినియోగం, లబ్ధిదారుల ఆసక్తి, ముందుగా ఖర్చు, రాయితీ సౌకర్యాలు.. తదితర అంశాలు తెలియజేస్తున్నామని ఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అన్ని వర్గాల వారికీ 300 యూనిట్ల వరకు ఒకే విధంగా రాయితీ ఉంటుందని, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఇంకా విధివిధానాలు రాలేదని చెప్పారు. ప్రస్తుతం వారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తున్నామని, సూర్యఘర్ పథకాన్ని ఎలా వర్తింపజేస్తారో ఖరారు కావాలన్నారు. అక్టోబరు నాటికి సర్వే పూర్తి చేసి యూనిట్ల ఏర్పాటుకు సిద్ధమవుతామని చెప్పారు.

రాయితీలు ఇలా..

- 300 యూనిట్ల వరకు రాయితీ వర్తిస్తుంది.
- అన్ని వర్గాల వారికీ ఒక్కో కిలోవాట్‌కు రూ.30 వేల వరకు సబ్సిడీ ఇస్తారు
- కిలోవాట్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో రూ.30 వేలు తిరిగి పొందవచ్చు
- 2 కేవీ ప్లాంటు అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల వరకు వ్యయం కాగా.. రూ.60 వేల వరకు రాయితీ కింద పొందవచ్చు
- 3 కేవీ అయితే రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు చేయాలి. ఈ విభాగం వారికి రూ.90 వేల సబ్సిడీ దక్కనుంది.
- ఈ ప్లాంట్లు 25 ఏళ్ల వరకు పని చేస్తాయి.

104, 108 వాహన సేవల్లో లోపాలుంటే చెప్పండి

క్షేత్రస్థాయిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 108 వాహనాలతో పాటు 104 (సంచార చికిత్స కేంద్రాలు), తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ నడుపుతోంది. చాలామంది వీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. కొందరు సంప్రదిస్తున్నా.. సకాలంలో రావడం లేదన్న ఫిర్యాదులున్నాయి. అలాంటి సమస్యలుంటే నేరుగా తమకు చెప్పొచ్చని, సందేహాలు, లోపాలున్నా తెలియజేయాలని ఆయా విభాగాల ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, 11 జిల్లాల జోనల్ మేనేజర్ నజీర్ హుస్సేన్ తెలిపారు. సంబంధిత సేవలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో తెలియజేశారు.
– న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం



'న్యూస్‌టుడే'తో జోనల్ మేనేజర్ హుస్సేన్

ముఖాముఖి

వారికి నిరంతరం అందుబాటులో..

తలసీమియా, డయాలసిస్, క్యాన్సర్, సికెల్‌సెల్ ఎనీమియా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని, గర్భిణులను అత్యవసర రోగులుగా గుర్తిస్తున్నాం. వీరికి నిరంతరం సేవలు ఉంటాయి. నచ్చిన ఆసుపత్రులకు తీసుకెళ్తాం.

సమీప మండలాలకు సమాచారం

108 వాహన చోదకులు పట్టణ పరిధిలో 15 నిమిషాల్లో, గ్రామీణ పరిధిలో 20 నిమిషాల్లో, గిరిజన, సుదూర ప్రాంతాలకైతే 30 నిమిషాల్లో వెళ్లాలి. ప్రస్తుతానికి ప్రతి మండలానికీ ఒక అంబులెన్సు ఉంది. రోగికి అవసరమైన సమయంలో మరో ప్రాంతానికి వాహనం వెళితే.. సమీప మండలాల నుంచి పంపిస్తున్నాం. అందులోనే ప్రాథమిక వైద్యం అందించేలా చూస్తున్నాం. గర్భిణులకు ప్రసవాలు చేసేలా ఈఎంటీలు శిక్షణ పొందారు.


108లో సేవలు

సద్వినియోగం చేసుకోవాలి

108లు 45, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు 38, 104లు 75 తిరుగుతున్నాయి. మూడు విభాగాలను ప్రస్తుతం పర్యవేక్షిస్తున్నా. ఈ మూడింటికీ కలిపి 104 టోల్‌ఫ్రీ నంబరు. లోపాలున్నా.. ఫిర్యాదులు చేయాలన్నా సంప్రదించవచ్చు.

మొదటి ప్రాధాన్యం..

రోగులు 108ను సంప్రదించినప్పుడే వారి పరిస్థితిని వివరిస్తారు. తద్వారా పైనుంచి వచ్చే ఆదేశాలను బట్టే ఈఎంటీలు, పైలట్లు నడుచుకుంటారు. వారికి నచ్చిన ఆసుపత్రికి తీసుకెళ్తారు. రోగి అభిప్రాయానికే తొలి ప్రాధాన్యం ఉంటుంది. అత్యవసరమైతే కొన్నిసార్లు సమీపంలో ఉన్న వైద్యాలయాలకు తీసుకెళ్తారు.

ఆ కేసులే ఎక్కువ

గర్భిణులు ఎక్కువగా మా సేవలు అందుకుంటారు. కొన్నాళ్లుగా డయాలసిస్, కడుపు నొప్పి, అపస్మారక స్థితికి చేరిన వారితో పాటు ఆత్మహత్యాయత్నాలు, పాముకాట్లు కేసులు కూడా వస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 44 మంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 679 మంది విషం తాగారు. డయాలసిస్ రోగులు 3,467 మంది కాల్ చేశారు. ఛాతిలో నొప్పితో 1,339 మంది, తీవ్రమైన కడుపు నొప్పితో 2,117 మంది, అపస్మారక స్థితిలో చేరిన వారి సంఖ్య 605గా నమోదైంది.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
ప్రకటనల్పై ఇంకో 5% శాతం అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
80085 97609

(c) eenadu

విద్యావ్యవస్థ ప్రక్షాళన అవసరం

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) రాష్ట్ర మహాసభలు విజయనగరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భగత్‌సింగ్ మేనల్లుడు, అఖిల భారత విద్యాహక్కు వేదిక (ఏఐఎఫ్ఆర్‌డీఈ) ఛైర్మన్ ఆచార్య జగ్‌మోహన్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రస్తుత విద్యావ్యవస్థ, యువత, ఉపాధ్యాయుల పాత్రపై ప్రసంగించారు. పలువురు వక్తలు తమ ప్రసంగాల్లో విద్యావ్యవస్థ ప్రక్షాళన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు నిర్వహణలో జాతీయ జెండాను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఏఐఎఫ్ఈఏ పతాకాన్ని జాతీయ అధ్యక్షుడు వై.సత్యం, ఏపీటీఎఫ్ ప్రగతి జెండాను ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకుడు జి.సత్యనారాయణ ఆవిష్కరించారు. ప్రముఖ చిత్రకారుడు ఇనపకుర్తి సత్యనారాయణ చిత్రకళా ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం జరిగిన విద్యాసదస్సులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు వి.నాగేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన నవోదయ సాహితీ సమాఖ్య ప్రతినిధి జతిన్‌కుమార్, ఏయూ ఆచార్యుడు ఆర్.శివప్రసాద్, జిల్లా విద్యాశిక్షణ సంస్థ అధ్యాపకుడు ఎన్.తిరుపతినాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం


ఓక్ జూబ్లీ లోగో ఆవిష్కరణలో అతిథులు, నాయకులు


విద్యార్థినుల భరత నాట్యం


ఏఐఎఫ్ఈఏ జాతీయ ఉపాధ్యక్షుడు సత్యం ఏకపాత్రాభినయం

అమ్మవారి లడ్డూ రూ.2,55,001

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: కోనమసివానిపాలెం గ్రామంలో శనివారం రాత్రి దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణ అవతారం రోజున దుర్గమ్మ పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశాఖలో తయారు చేసి తీసుకొచ్చిన 54 కిలోల లడ్డూను వేలం వేశారు. పెందుర్తి మండలం పుల్లవానిపాలెం గ్రామానికి చెందిన చక్రి రూ.2,55,001కు సొంతం చేసుకున్నారు. అంబలం పూజలో 123 భవానీ పీఠాల నుంచి వేల సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న భవానీ మాలధారులు

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. GODABA SURESH** S/o G. Simhachalam by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Erstwhile Vizianagaram District, Presently Parvathipuram Manyam District, Komarada Mandalam, Vikramapuram Gram panchayat and village accounts covered by S.Nos.127-13 and 127-18 part, **Plot No.89** site measuring East to West 20 feet or 6.10 meters and North to South 45 feet or 13.72 meters totaling 100 Sq. yards or 84 Sq. meters of vacant site is bounded by:

East: Plot No.90 site, **South:** 20 feet wide layout Road, **West:** 20 feet wide Road, **North:** Plot No.74 site.

KODURI SREENIVASA RAO
Smt. SIVA KUMARI JALADI
Advocates
S-2, Bharat Apartments, Seethammadhara,
Visakhapatnam-13.
Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com

Dt. 05.10.2024
Visakhapatnam

నేడు హజరత్ ఖాదర్ బాబా జయంతి వేడుకలు

విజయనగరం అయ్యన్నపేట(మయూరికూడలి), న్యూస్‌టుడే: విజయనగరం బాబామెట్ట హజరత్ హజరత్ సయ్యద్ ఖాదర్ వలీబాబా 128వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బాబా దర్గా దర్బార్ ధర్మకర్త డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షరీఫ్ షా జాజ్ బాబా (ఖలీల్ బాబు) ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా ఉదయం దర్గాలో ఖురాన్ పఠనం, ప్రార్థనలు ఉంటాయని, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, ఫకీరు మేళాలతో దర్బార్ నుంచి ప్రత్యేక చాదర్, సుగంధం, పూలు, పండ్లతో ఊరేగింపుగా వెళ్లి దర్గాలో బాబావారికి సమర్పించి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్బార్ లంగర్ ఖానాలో విచ్చేసిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా ఆశీర్వచనాలు పొందాలని కోరారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Parvathipuram Branch, Parvathipuram Manyam District,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. VOONA BHASKARA RAO** S/o V Ramanayya by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULES OF THE PROPERTY

Item No.01: (Property covered under document No.1917/2012) Srikakulam District, Palakonda Sub-District, Veeragattam Mandalam, Nadukuru Gram panchayat and village accounts zeriothy dry land covered by S.No.58-2 an extent of Ac.0.94 cents, and S.No.58-3 an extent of Ac.0.62 cents totaling Ac.1.56 cents in which **Plot No.03** site measuring East to West 20 feet or 6.18 meters and North to South 63 feet or 19.467 meters totaling 140 Sq. yards or 117.6 Sq. meters of vacant site nearby D.No.1-30 is bounded by:

East: Plot No.4 site, **South:** 20 feet wide layout road, **West:** Plot No.2 site, **North:** Dry land of Karri Venkata Naidu


Item No.02: (Property covered under document no.20572020) Srikakulam District, Palakonda Sub-District, Veeragattam Mandalam, Nadukuru Gram panchayat and village accounts zeriothy dry land covered by S.No.58-2 an extent of Ac.0.94 cents, and S.No.58-3 an extent of Ac.0.62 cents totaling Ac.1.56 cents in which **Plot No.01** site measuring East to West 17.5 feet or 5.407 meters and North to South 68 feet or 21.012 meters totaling 133 Sq. yards or 111.72 Sq. meters of vacant site nearby D. No.1-30 is bounded by:

East: Plot No.2 site, **South:** 20 feet wide layout road, **West:** Site of V Indrani etc., **North:** Dry land of Karri Venkata Naidu

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Seethammadhara,
Visakhapatnam-13. Mobile No. 9885166648
Mail: sreenivaskoduri@gmail.com

Visakhapatnam
Dt.05.10.2024

'ప్రశస్త్' యాప్‌తో.. లోపాల గుర్తింపు



న్యూస్‌టుడే, కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వైకల్యాలను గుర్తించడానికి ఎన్‌సీఈఆర్‌టీ 'ప్రశస్త్' పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించింది. శారీరక, మానసిక వైకల్యం ఉన్నవారి గురించి అందరికీ తెలుస్తోంది. కానీ పలు రకాల వైకల్యాలు ఎదుర్కొంటున్న విద్యార్థులు చాలా మంది ఉన్నారు. వీరిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దసరా సెలవుల ముందే సర్వే మొదలైంది. ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో ఆగింది. విద్యార్థుల్లో అనుమానిత వైకల్యం ముందుగానే గుర్తించి అనువైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వంద శాతం నమోదు చేస్తాం.. ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వందశాతం నమోదు చేసేలా చూస్తాం. ఈ వివరాలు ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం దసరా సెలవుల వల్ల సర్వే ఆగింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక మొదలు పెడతాం. త్వరితగతిన పూర్తిచేయమని చెప్పాం. – సిరికి సూర్యారావు, సహిత విద్య జిల్లా సమన్వయకర్త, విజయనగరం

ఉపాధ్యాయులదే బాధ్యత

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను పార్ట్-1లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పేరు సర్వీసు నంబర్, మెయిల్ ఐడీ, చరవాణి, యూడైస్ కోడ్‌తో లాగిన్ అయ్యాక నమోదు చేయాలి. లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులను పార్ట్-2 కింద ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులు పరిశీలిస్తారు.

వీటిని గుర్తిస్తారు..

వైకల్యాలున్న పిల్లలను ప్రవేశించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం, ఆశ్రేయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టత సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థుల సమగ్ర విద్యను ప్రోత్సహించడం దీని లక్ష్యంగా చెబుతున్నారు. విద్యార్థుల్లో వినడం, చదవడం, మాట్లాడటం, కళ్ల గ్రహణంతో పాటు చెప్పినదాన్ని పదేపదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, అనుమతి లేకుండా క్లాస్ నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టతలేని చేతిరాత, రివర్స్‌గా రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడటం, పునరావృత ప్రవర్తనలో ఇబ్బందులు, ఆకస్మిక లేబోవడం, చెప్పింది చెబుతూ ప్రతిస్పందించడం, వివరాలు కొనసాగించడం, ఇతర విద్యార్థులతో పోల్చితే సులభంగా అలసిపోవడం. ఇలా 171 రకాల లోపాల్లో ఏ రకమైన ఎదుర్కొంటున్నది ఉపాధ్యాయులు స్వీయ పరిశీలనతో నమోదు చేస్తారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు : 1,13,424 మంది	ఒకటి నుంచి అయిదో తరగతి వరకు : 46,965
5 నుంచి 10 వరకు : 66,459	యూడైస్ సర్వే ప్రకారం జిల్లాలో 18 ఏళ్లలోపు దివ్యాంగులు : 4,300

ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత అవసరం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఎంతో భక్తితో గుడికి వచ్చే భక్తుడికి తల్లి దర్శనంతో పాటు ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. ఆదివారం పైడితల్లి పండగ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ఆలయం వెనుక భాగాన కుప్పలుగా పోసి ఉన్న పూజా సామగ్రిని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆలయ సిబ్బందిపై ఉందన్నారు. పండగ సమీపిస్తున్న తరుణంలో త్వరితగతిన క్యూలైన్లు, తాటాకు పందిళ్లు వేసి భక్తులకు కనీస వసతులు కల్పించాలని తెలిపారు. ఎమ్మెల్యే అదితి గజపతి రాజు మాట్లాడుతూ ఏర్పాట్లలో రాజీ పడొద్దని, భక్తునికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. వీరి వెంట సింహాచలం దేవస్థానం ఈవో, పైడితల్లి పండగ ముఖ్య అధికారి వి.త్రినాథరావు, పైడితల్లి దేవస్థానం ఈవో ప్రసాదరావు ఉన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, అదనపు కమిషనర్ రామచంద్ర మోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు.


ఏర్పాట్లపై ఏసీ ప్రసాదరావుతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే లక్ష్యం

● సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అప్పుడే విద్యా లక్ష్యాలను చేరుకోగలుగుతామని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీఎం రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్, స్కూల్ ఇన్‌ఫ్రా బి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఖాళీగా ఉన్న పీఈటీ, పీడీ ఉద్యోగాల భర్తీకి డీఎస్సీ ప్రకటన ఇచ్చి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎంఈవో కారు పున్నయ్య, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేష్, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, పీఈటీ, పీడీల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, 13 జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారిణిలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: త్రివిధ దళాల్లో ఉన్నతాధికారులుగా స్థిరపడాలంటే ఆరోగ్యకరమైన జీవన శైలి, శారీరక బలం అవసరమని కోరుకొండ సైనిక్ పాఠశాల ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్. శాస్త్రి చెప్పారు. ఆదివారం కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ రేస్-1 పోటీ నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇటువంటి పోటీలు ఓర్పు, క్రమశిక్షణను పెంచుతాయని, ఆరోగ్యకరమైన పోటీలు విద్యార్థుల వికాసానికి దోహదపడతాయని వివరించారు. జూనియర్ల విభాగంలో మౌర్య హౌస్, సీనియర్ల విభాగంలో గుప్తాహౌస్‌లు మంచి ప్రదర్శన ఇచ్చారు. సీనియర్లలో శైలేష్ చౌదరి, పుష్యేన్, ప్రశాంత్ చౌదరి, జూనియర్లలో అనూప్ సింగ్, ఆశిష్‌సింగ్, రౌనక్‌కుమార్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. పోటీ విజేతలకు, పాల్గొన్న విద్యార్థులను శాస్త్రి, అధ్యాపకులు అభినందించారు.


క్రాస్‌కంట్రీ పోటీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ శాస్త్రి


విజేత విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

చెరువులో పడి యువకుడి దుర్మరణం

వంగర, న్యూస్‌టుడే: కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో పడి ప్రాణాలు కోల్పోయారు. వంగర మండలం అరసాడ గ్రామానికి చెందిన సుఖవాసి శంకర్ (33) శనివారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి కాలు జారి పడిపోయినట్లు మృతుడు తల్లి గౌరమ్మ ఆదివారం వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వంగర ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతను అవివాహితుడు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సుఖవాసి శంకర్ (పాతచిత్రం)

పురుగు మందు తాగి బలవన్మరణం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ వివరాల మేరకు.. చౌదంతివలసకు చెందిన ఇ.భాస్కరరావు(48) మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. శనివారం తీవ్ర కడుపు నొప్పి రావడంతో బాధను తట్టుకోలేక పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య చిన్నమ్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై వృద్ధుడి అత్యాచారం

భామిని, న్యూస్‌టుడే: తొమ్మిదేళ్ల చిన్నారిపై ఓ వృద్ధ కామాంధుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బత్తిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భామిని మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(9) తల్లిదండ్రులు కూలి పనుల నిమిత్తం విశాఖపట్నంకు వెళ్లడంతో నాన్నమ్మతో కలిసి ఉంటుంది. అదే గ్రామానికి చెందిన చిన్నారావు(69) కూడా కూలి పనుల కోసం రాజమహేంద్రవరం వలస వెళ్లారు. వృద్ధాప్య పింఛను కోసం నెలవారీగా ఇక్కడికి వస్తుంటాడు. ఈ క్రమంలో చిన్నారిపై కన్నేసిన వృద్ధుడు ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారి పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై డి.అనిల్‌కుమార్‌తో సహా సిబ్బంది గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించి, వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు గంటల నరకం

చెట్టును ఢీకొట్టిన లారీ

పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: ఈ ప్రాంతం కాదు.. ఫోన్ ఎక్కడుందో తెలియదు.. చుట్టూ అంధకారం.. కాలు కదపాలన్నా వీలు పడని పరిస్థితి.. ఇలాంటి స్థితిలో ఏకంగా నాలుగు గంటల పాటు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయాడు ఆ లారీ చోదకుడు. లక్కవరపుకోట మండలం పోతంపేటకు చెందిన కె.రమణ లారీ చోదకుడు. ఈ నెల 4న విశాఖ నుంచి తారు ట్యాంకర్‌ను జేకేపూర్ తీసుకెళ్లి అన్‌లోడు చేసి తిరిగి 5న రాత్రి స్వగ్రామం బయలుదేరాడు. రాత్రి ఒంటి గంట సమయంలో సీతానగరం మండలం అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించే క్రమంలో లారీ చెట్టును ఢీకొట్టింది. ముందు భాగం నుజ్జువగా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. ఆయన కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఉదయం 5 గంటల సమయంలో అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని సహాయక చర్యలు చేపట్టి బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించి విశాఖకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


క్షతగాత్రున్ని మోసుకు వెళ్తున్న పోలీసు

'సకాలంలో చికిత్స అందకే చనిపోయాడు'

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి తీసుకువచ్చిన తమ తండ్రికి సకాలంలో వైద్యులు చేరుకుని చికిత్స చేయకపోవడంతోనే చనిపోయాడంటూ గజపతినగరం మండలం తుమ్మికాపల్లికి చెందిన రాపర్తి నూకరాజు (55) కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో ఉన్న నూకరాజును ఆదివారం గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువచ్చామని, వైద్యుడు పైగది నుంచి అరగంట వరకు రాలేదని మృతుడి భార్య సీత, కుమార్తెలు, ఇతర కుటుంబీకులు అన్నారు. వైద్యుడు చేరుకుని ఒక ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే ఆయన గుండెపోటుతో కుప్పకూలాడని రోదించారు. వైద్యం సకాలంలో అందించి ఉంటే బతికేవాడన్నారు. ఎస్సై లక్ష్మణరావు సిబ్బందితో చేరుకుని విషయం తెలుసుకున్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఎస్సై అన్నారు.


ఎస్సైకు వివరాలు తెలుపుతున్న కుటుంబీకులు

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు ఆదివారం పార్వతీపురంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి సంఘం సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ సూచించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పి.శేషు, ముఖ్య సలహాదారులుగా ఐ.గున్నేశ్వరరావు, పి.సూర్యారావు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. జిల్లా మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రామసత్యనారాయణ కోరారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి సముచిత స్థానం కల్పించాలని కోరారు. తెదేపా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, ఎ.గోవిందరావు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా కార్యవర్గం

విజయనగరం ఉత్సవాల్లో కవి సమ్మేళనం

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఈ నెల 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాల్లో సాహితీ కార్యక్రమాలను స్థానిక ఎమ్మార్ లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ వేదిక కన్వీనర్, సంస్కృత కళాశాల అధ్యక్షుడు గంట జనార్దననాయుడు తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం దర్శకత్వంలో సుభద్రదేవి నిర్వహణలో భువన విజయం నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కన్వీనర్లు మానాప్రగడ సాహితి, రత్నాల బాలకృష్ణ, కో-కన్వీనర్లు చీకటి దివాకర్, భోగరాజు సూర్యలక్ష్మి, ఎన్.కె.బాబు ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం విజయనగరం జిల్లా కవులచే నిర్వహించనున్నామన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు 10వ తేదీలోగా తమ కవితలను 94401 43488, 94411 76882, 94401 17116 నంబర్లలో ఒకదానికి మాత్రమే యూనికోడ్ ఫాంట్‌లో టైప్ చేసి పంపిస్తూ రెండు కాపీలను కవితా వేదిక వద్దకు తీసుకురావాలన్నారు. దేశభక్తి, సామాజిక స్పృహను కవితా అంశంగా తీసుకొని 20 నుంచి 30 పంక్తులకు మించకుండా ఒకరు ఒక కవితను మాత్రమే పంపించాలన్నారు. ఎంపిక చేసిన కవితపై 14న ఉదయం జక్కు రామకృష్ణ, జీఎస్ చలం ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్తలతో సాహితీ గోష్ఠి నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ఎ.గోపాలరావు ఆధ్వర్యంలో డాక్టర్ మీగడ రామలింగస్వామి సంగీత నవావధానం నిర్వహిస్తామన్నారు.

EENADU e Classifieds

EDUCATION

Online Degree, PG, Diploma, B.Tech, MBA, MCA etc., Courses, Admissions going on, Guarantee Pass, Low Fees, Eligible for all Jobs. ✆ 7997296796.

REAL ESTATE

LAND FOR SALE

Land for Rent 600 Sq Yds, Pradeepnagar, Vizianagaram. Cont: 9989370188, 9949418072.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 90008 66020

PLOT FOR SALE

225 Sq.Y North, East Corner Site for sale at K.L.Puram, Vizianagaram. Cont: 8497961518.

300 Sq.Y West Facing Site for sale at Pradeep Nagar, Vizianagaram. Cont : 8497961518.

భోగాపురం ఇంటర్నేషనల్ Airportకి అతి సమీపంలో National Highwayకి 1.5 KM Distanceలో Vempadam Village వద్ద 100 చ॥గ॥ 8,99,999/- కే ఇంటి స్థలం కలదు. Cont : 8247013940, 9666959299.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవ్‌డ్ ఇళ్ల స్థలాలు స్పాట్/ వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ళ పద్మావతి. 9493640700, 9493640600.

TO LET

COMMERCIAL

Shops for Rent, Near Raghu Engineering College, Dakamarri Jn, VSP Dist. Cont: 9949418072, 9989370188.

JOBS

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం.18K . ✆ 96402 58899, 96404 68899.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వసతి గృహాల్లో డిజిటల్ రిసోర్స్ కేంద్రాలు

● ఉమ్మడి జిల్లాలో ఆరు బీసీ కేంద్రాల్లో ఏర్పాటు
● నవంబరు 14న ప్రారంభానికి సన్నాహాలు


వసతి కేంద్రంలో విద్యార్థులు

విజయనగరం మయూరి కూడలి, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ వసతి కేంద్రాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహారం, ఆరోగ్యంతో పాటు ఉత్తమ విద్యను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో తొలి దశలో బీసీ సంక్షేమ ప్రీమెట్రిక్ వసతి కేంద్రాల్లో డిజిటల్ రిసోర్సు సెంటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. విజయనగరం, మన్యం జిల్లాల్లో ప్రభుత్వ సొంత భవనాలుండి, 8, 9, 10వ తరగతి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆరింటిని ఎంపిక చేసింది. తొలి విడతలో విజయనగరం బీసీ కాలనీ, కొత్తవలస, బొబ్బిలి బాలికల వసతిగృహాలు, గజపతినగరం, పార్వతీపురంలో నర్సిపురం, జియ్యమ్మవలస బాలుర వసతి కేంద్రాల్లో ఏర్పాటుకు నిర్ణయించారు. వీటిని నవంబరు 14న ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

అభ్యసనాసక్తి పెంచడానికి..

డిజిటల్ రిసోర్సు సెంటర్ల కోసం వసతి గృహాల్లో ఒక్కో గదిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది.. డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు తదితర సాంకేతిక యంత్రాలు అమరుస్తారు. వివిధ పాఠ్యాంశాల్లో క్లిష్టమైన అంశాలు సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ సమాచారాన్ని పెన్‌డ్రైవ్ ద్వారా అందిస్తారు. ఇది చదువులో వెనుకబడిన వారిలో ఆసక్తి పెంచడానికి దోహదపడుతుంది. తొలి దశలో ఈ కేంద్రాల్లో విజయవంతమైతే మిగిలిన వాటిలో కూడా దశల వారీగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే వసతి కేంద్రాల్లో ఉండే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడానికి బోధకులు లేకపోవడంతో ఇబ్బందుల పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. గణితం, సైన్సు, ఆంగ్లం, హిందీ తదితర పాఠ్యాంశాల బోధనకు ట్యూటర్లను నియమించాలని జిల్లా శాఖాధికారులకు ఉత్తర్వులు ఇచ్చింది.

సామర్థ్యాలు మెరుగుపడతాయి



డిజిటల్ రిసోర్సు కేంద్రాల ఏర్పాటు వల్ల వసతి గృహాల్లోని విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయి. ప్రస్తుతం గుర్తించిన ఆరు కేంద్రాల్లో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. విద్యార్థులకు పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను తీర్చడానికి బోధకులను కూడా నియమించనున్నాం.

–పెంటోజీరావు, ఇన్‌ఛార్జి, బీసీ సంక్షేమ శాఖ, విజయనగరం

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పెద్దింపేటలో బీసీ, ఎస్సీ కాలనీలకు పక్కా రహదారులు లేవు. వర్షాలు పడితే పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. - గ్రామస్థులు, పెద్దింపేట

❖ పక్కా రహదారుల నిర్మాణానికి నిధులు వచ్చాయి. త్వరలో పనులు చేస్తాం. - ఒజయప్రకాష్, సర్పంచి - బలిజిపేట గ్రామీణం

? దీకోట్టం సమీపంలో మందు కాలువపై వంతెన లేక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - గ్రామస్థులు

❖ పరిశీలించి కాలువపై వంతెన వేస్తాం. - జీవీఆర్ మూర్తి, ఈవోపీఆర్డీ

- న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? రజక వీధిలో మోటారు ప్యానల్ బోర్డు మరమ్మతులకు గురైంది. పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి. - స్థానికులు

❖ సమస్యను గుర్తించాం. మరమ్మతులు చేయిస్తాం. - గౌరీశంకరరావు, సర్పంచి

- న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

? తహసీల్దారు కార్యాలయం ముఖద్వారం పరిసరాల్లో మొక్కలు పెరిగిపోయాయి. - స్థానికులు

❖ మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - సీతారామయ్య, తహసీల్దారు

- న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

? కురుపాంలోని ప్రదేశ్‌నగర్ కాలనీ సమీపంలో ఉన్న కాలువలో పలువురు వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు

❖ కాలువ శుభ్రం చేయిస్తాం. ఇకపై ఎవరైనా వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, ఈవో

- న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? కోసంగి, వెంపలగూడ, కీసరజోడు, చిన్నబర్గ తదితర కూడళ్లలో ప్రయాణికుల విశ్రాంతి భవనాలు పాడయ్యాయి. - ప్రయాణికులు

❖ పరిశీలించి బాగు చేసేలా చూస్తాం. - కె.సత్యం, ఈవోపీఆర్డీ - సీతంపేట

? గడబ బొడ్డవలస నుంచి కొత్తవలస వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. - స్థానికులు

❖ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. - శంకరరావు, ఏఈ

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

? పాలకొండ యాతవీధికి వెళ్లే రహదారిలో విద్యుత్తు స్తంభాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. - రాణి, విద్యార్థిని

❖ విద్యుత్తు స్తంభాలు వేసేందుకు ఆ శాఖాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. - దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ

- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఏనుగులతో పంటలకు నష్టం


తోటలో తిరుగుతున్న ఏనుగులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని డబ్బుగుడ్డి వలస సమీప తోటల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. ఆదివారం ఉదయం వరి, జొన్న తోటల్లో తిరుగుతూ పంటలు నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. నష్టాలను వీఆర్వోలతో కలిసి అటవీ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ప్రత్యేక పర్యవేక్షణ అధికారి మణికంఠేశ్ నేతృత్వంలో ట్రాకర్లు పర్యవేక్షిస్తున్నారు.

గుంతలో పడతారు.. జాగ్రత్త



సాలూరు మండలంలోని ఎగిరెడవలస కూడలి నుంచి మావుడి వెళ్లే రహదారిలో భారీ గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రమాదాలకు గురవకుండా గుంతలో కర్రలు పెట్టి సూచిక ఉంచారు. దీనిపై పీఆర్ ప్రాజెక్టు ఏఈ శంకరరావు మాట్లాడుతూ.. రహదారి నిర్మాణానికి ప్రతిపాదించామని, నిధులు విడుదల కావాల్సి ఉందని తెలిపారు. - న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

పెదపెంకి.. ప్రతి వీధిలోనూ సమస్యలే!

పెదపెంకి.. బలిజిపేట మండలంలోనే పెద్ద గ్రామం. ఇక్కడ 1900 ఇళ్లు.. 10 వేల మందికి పైగా జనాభా ఉంటారు. ప్రతి ఎన్నికల్లో ఈ గ్రామం కీలకంగా మారుతుంది. 6 వేల మందికి పైగా ఓటర్లు ఉండటంతో నాయకులు గ్రామం చుట్టూ తిరుగుతారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కరించే వారే కరవయ్యారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. - న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం


కుళాయి నీటి కోసం పాట్లు పడుతున్న గ్రామస్థులు

పెదపెంకి గ్రామంలో మురుగు కాలువ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో ఇళ్ల మధ్య, రహదారులపై మురుగు పారుతూ కంపు కొడుతుంది. గ్రామం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది బోదకాలు వ్యాధి. ఎక్కువ మంది ఈ బారిన పడి మంచం పడుతున్నారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం గ్రామంలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా ఉందని, మెరుగు పర్చాలని అధికారులను సూచించారు. తాగునీరు, విద్యుత్తు సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. అంపావల్లి రక్షిత పథకం ద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. కానీ తరచూ పైపులైన్లు పగలడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

బోద యూనిట్ ఏర్పాటుకు వినతి..

తెలగవీధి వద్ద కొత్త కల్వర్టు నిర్మాణానికి పది రోజుల క్రితం తవ్వకాలు చేపట్టి పనులు ఇప్పటికీ చేయలేదు. ప్రధాన వీధుల్లో కాలువలపై ఇళ్ల నిర్మాణాలతో మురుగు వెళ్లే మార్గం లేకుండా పోయింది. వర్షాల సమయంలో ఎస్సీ రెల్లి వీధులు జలమయం అవుతున్నాయి. సామాజిక మరుగుదొడ్డి లేక ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. రెండు శ్మశానాలకు వెళ్లే మార్గం అభివృద్ధి చేయాల్సి ఉంది. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని దశాబ్దాలుగా కోరుతున్నా పనులు జరగలేదు. బోద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఫైలేరియా యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచి పాపారావు మాట్లాడుతూ.. పంచాయతీకి సరిపడా నిధులు రావడం లేదన్నారు. పాత పనులకు బిల్లులు బకాయిలు ఉన్నాయన్నారు. విషయం ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలియజేశారు.


రహదారి పక్కన మురుగు నిల్వలు

గత పాలకుల నిర్వాకం.. కురుపాం ప్రజలకు శాపం


అధ్వానంగా మారిన కురుపాం రహదారి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్వాకంతో ఏళ్లుగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అయిదేళ్లలో రహదారుల పనులు పూర్తిగా పక్కన పెట్టేయడంతో కొన్ని చోట్ల రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పార్వతీపురం నుంచి ఒడిశా రాష్ట్రానికి వెళ్లే కురుపాం ప్రధాన రహదారిది ఇదే పరిస్థితి. తోటపల్లి నుంచి కురుపాం వరకు విస్తరణ పనులు చేసేందుకు రూ.కోట్లలో నిధులు విడుదల చేసినా పనులు చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

రూ.39 కోట్లు విడుదల చేసినా..

పార్వతీపురం జిల్లా కేంద్రం నుంచి ఒడిశాలోని గుణుపూర్ వరకు రహదారి బాగుకు గత ప్రభుత్వంలో నిర్ణయించారు. తోటపల్లి నుంచి కురుపాం వరకు 14 కిలోమీటర్ల పొడవున విస్తరించేందుకు మూడేళ్ల క్రితం రూ.39 కోట్ల నిధులు విడుదల చేశారు. విస్తరణ పూర్తయితే ఒడిశాతో పాటు పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, విశాఖ తదితర ప్రాంతాలకు సులభంగా రాకపోకలు సాగించవచ్చు కానీ పనులు ప్రారంభించి పూర్తి స్థాయిలో చేయలేదు. జియ్యమ్మవలస మండలం పెదమేరంగి, సీమనాయుడువలస కూడళ్లలో రాళ్లు వేసి వదిలేశారు.


కాలువ దుస్థితి

ఆ తర్వాత కురుపాం మండల కేంద్రంలో జాప్యం చేస్తున్నారు. ఇక్కడ కాలువలు అధ్వానంగా మారాయి. రోజూ ధూళి రేగడంతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. రహదారి పక్కన వ్యాపారాలు నిర్వహించేవారు ఇబ్బందులు పడుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తా..

జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారుల వివరాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం. ఇటీవల కొన్నింటికి నిధులు మంజూరు చేశారు. తోటపల్లి- కురుపాం రహదారి విస్తరణ రూ.39 కోట్ల అంచనాతో ప్రారంభించారు. కురుపాం వరకు పూర్తిచేశాం. బస్టాండ్‌లో కొన్ని ఇళ్లు తొలగించాల్సి ఉండటంతో ఆలస్యమైంది. ర.భ.శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే, కురుపాం

బడిదేవర కొండపై పూజలు



పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బడిదేవర కొండపై దేవరకు సంగంవలస రైతులు వరదపాశం పోశారు. ఆదివారం గ్రామస్థులు కొండకు వెళ్లి విగ్రహాన్ని రంగులతో అలంకరించారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా ఉభాలు పూర్తయిన తర్వాత వరదపాశం పోయడం ఇక్కడ ఆనవాయితీ అని గ్రామస్థులు చెబుతున్నారు. సర్పంచి చిట్టినాయుడు, మాజీ సర్పంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురికి గాయాలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని బొలేరో ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడిన ఘటన పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. బొబ్బిలికి చెందిన వి.రామకృష్ణ పార్వతీపురం విద్యుత్తు శాఖలో ఉద్యోగి. ప్రార్థనలు చేసేందుకు పార్వతీపురానికి చెందిన జి.సురేష్, సీహెచ్.అవినాష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పాలకొండ వెళ్తున్నారు. అడ్డాపుశీల దాటిన తర్వాత బాచి కూడలి వద్ద వెనుక నుంచి వచ్చిన బొలెరో ఢీకొట్టింది. తీవ్రగాయాలైన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ● పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామం సమీపంలో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఇద్దరు యువకులు గాయపడగా స్థానికులు గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలియజేశారు.

ఏకగ్రీవంగా మత్స్యకార సంఘ ఎన్నికలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోని స్వదేశీ మత్స్య, పారిశ్రామిక సంఘ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి తిరుపతయ్య అన్నారు. అధ్యక్షుడిగా బి.గున్నారావు, కార్యదర్శిగా కె.రాములు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, సహ కార్యదర్శులుగా ఎం.మురళి, కె.సత్యనారాయణ, ఎస్.పాలందొర, ఎస్.గంగారావు ఎన్నికైనట్లు చెప్పారు. వీరికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాల అమలు తీరుపై అవగాహన కల్పించారు.

ప్రమాదం తప్పించారు

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బందలుప్పి ఉన్నత పాఠశాలలో స్తంభానికి ఉన్న విద్యుత్తు తీగలను అధికారులు ఆదివారం తొలగించారు. ఇక్కడ తీగలు గదుల పైనుంచి ఉండటంతో విద్యార్థులు ఆందోళన చెందేవారు. దీనిపై సెప్టెంబరు 19న 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'గా స్థానికులు తెలిపారు. వార్త ప్రచురించగా.. ట్రాన్స్‌కో ఏఈ రామారావు ఆధ్వర్యంలో వాటిని తొలగించారు.

కరుణించవే కనకదుర్గ


ఏలాంలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న చిన్నారులు

దసరా నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వేడుకగా జరుగుతున్నాయి. పాలకొండ జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆదివారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సాలూరు పంచముఖేశ్వర ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరఘట్టంలోని కోటదుర్గ ఆలయంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో విశేష కుంకుమార్చనలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, బృందం


రావాడ కూడలిలో కోటదుర్గమ్మ


గాయత్రి అవతారంలో కొత్తవలస నవదుర్గ


పార్వతీపురం బైపాసు కాలనీలో లలితా త్రిపుర సుందరిగా..


వీరఘట్టం కోటదుర్గ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు


తుమరాడ గ్రామంలో..

ట్రైకార్ సభ్యురాలికి స్వాగతం



రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ ఫైనాన్స్ (ట్రైకార్) సభ్యురాలిగా అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసి ఆదివారం స్వగ్రామానికి విచ్చేసిన పువ్వల లావణ్యకు కూటమి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎర్రన్నగుడి నుంచి భారీ ర్యాలీగా ఇంటికి చేరుకున్నారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

సేవలతో గుర్తింపు



పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఏ రంగంలో అయినా వ్యక్తులు అందించిన సేవలతోనే మంచి గుర్తింపు వస్తుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.దుర్గారావు, మీడియా కన్వీనర్ ఎ.వెంకట్రావు అన్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు పి.గుంపస్వామిని ఆదివారం సత్కరించారు. రాష్ట్ర సహాధ్యక్షుడు వి.పాపారావు, నాయకులు ఎ.సూర్యనారాయణ, ఎస్.రవికుమార్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



కొమరాడ మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2003లో ఇక్కడ చదివిన వారంతా 21 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. – న్యూస్‌టుడే, కొమరాడ

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని విశ్వనాథపురంలో అతిసారంతో మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మర్రి శ్రీనువాసరావు డిమాండ్ చేశారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. తాగునీటి ట్యాంకు, పాత పైపులు మార్చాలని అధికారులను కోరారు. పార్టీ నాయకులు శ్రీనివాసరావు, అప్పలస్వామి, సింహాచలం పాల్గొన్నారు.

నేటి నుంచి తపాలా శాఖ వారోత్సవాలు

పార్వతీపురం పురపాలక: పార్వతీపురం తపాల డివిజన్ పరిధిలో సోమవారం నుంచి 11 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ పర్యవేక్షకుడు బాబూరావు తెలిపారు. తపాలా శాఖ ఏర్పడి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కషాయాలతో పంటలకు మేలు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వివిధ రకాల ఆకులతో కషాయాలు తయారు చేసి పంటలకు వేస్తే మేలైన దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి భూషణరావు తెలిపారు. ఎల్విన్‌పేట పంచాయతీలోని జేకేపాడులో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, జిల్లేడు ద్రావణం తయారీ, వినియోగం గురించి వివరించారు.

నేడు పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. గిరిజనులు వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక


శిక్షకుడు నరేష్‌తో శరణ్య

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.శరణ్య రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు కె.నరేష్ తెలిపారు. విజయనగరంలో జరిగిన అండర్-14 పోటీల్లో విజేతగా నిలిచినట్లు చెప్పారు. అనంతపురంలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు.

ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ కోటదుర్గమ్మ సన్నిధిలో సురభి నాటక సమాజం కళాకారులతో మొదటి సారిగా నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. రెండు రోజులుగా శ్రీకృష్ణలీలలు, మాయాబజార్ పౌరాణిక నాటికలు వేశారు.



7 వేల ఎకరాలకు.. నీరేది?

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: కురుపాం నియోజకవర్గంలో జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కురుపాం మండలాల్లో పంటల సాగుకు ప్రధాన నీటి వనరు వట్టిగెడ్డ జలాశయం. కొన్నేళ్లుగా నిర్వహణకు నోచుకోవడం లేదు. ఆధునికీకరణకు రూ.43 కోట్లు జైకా నిధులు వచ్చినా పనులు సక్రమంగా జరగలేదు. ఈ ఆగస్టు 11న ఎమ్మెల్యే జగదీశ్వరి నీరు విడుదల చేసినా సగం ఆయకట్టుకు కూడా చేరలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పుష్కలంగా నీరున్నా..

వట్టిగెడ్డ జలాశయంలో సగటు నీటి మట్టం 399 అడుగులు. ప్రస్తుతం 387 అడుగుల మేర నీరు ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా 230 క్యూసెక్కులు పంట పొలాలకు విడుదల చేస్తున్నారు. 150 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. అయినప్పటికీ శివారు భూములకు చేరడం లేదు. పెదమేరంగి కూడలి వద్ద అయిదో బ్రాంచికి కనీసం చుక్క


పెదమేరంగి కూడలి వద్ద నీరు రాని బ్రాంచి

నీరు కూడా రావడం లేదు. దీని పరిధిలో 7 వేల ఎకరాలు సాగవుతున్నాయి.

రెండు నెలలు అవుతున్నా..

జలాశయం కుడి, ఎడమ కాలువ కింద 17 వేల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఖరీఫ్ పంటకు పూర్తిస్థాయిలో నీరు అందించాలి. ఏటా 10 వేల ఎకరాలకు మించి చేరడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలు అధ్వానంగా మారడంతో నీరు వదిలి రెండు నెలలు అవుతున్నా సుమారు 7 వేల ఎకరాలకు చేరలేదు. దీంతో శివారునున్న పెదమేరంగి, కుదమ, చింతలబెలగాం, దత్తివలస, రాజయ్యపేట, పరజపాడు, నీచుకువలస, గవరమ్మపేట రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు..

కుడి, ఎడమ రెండు కాలువల పరిధిలో సుమారు 18 డ్రాపులు, ఖానాలు శిథిలమయ్యాయి. మొత్తం 9 డిస్ట్రిబ్యూటరీలు ఉండగా కొన్ని పాడైనట్లు రైతులు చెబుతున్నారు. ప్రతాపసాగరం, దొరచెరువు, జగన్నాథసాగరం, గౌరీసాగరం వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ఆయా పనులు పూర్తయితేనే అన్ని ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉంటుంది.

శివారుకు నీరందిస్తాం..: కాలువలో పనికిరాని మొక్కలు ఉండటంతో అయిదో బ్రాంచికి నీరు చేరడం లేదు. కుడి కాలువ షట్టర్లు ఎత్తి మరింత నీరు వదులుతాం. శివారు ఆయకట్టుకు నీరు అందిస్తాం.
- జీవీ రఘు, ఏఈ, వట్టిగెడ్డ జలాశయం

పొంచిఉన్న ప్రమాదం



గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి.ఆమిటి కాలనీకి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉంది. ఆటలాడే సమయంలో పిల్లలు ప్రమాదాల బారిన అవకాశం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. నియంత్రిక ఎత్తుగా ఉన్న ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు. పరిశీలించి దిమ్మె ఎత్తు పెంచుతామని విద్యుత్తు శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

మళ్లీ కూరుకుపోయిన లారీ

కొమరాడ సమీపంలో గోతుల్లో లారీ దిగబడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రతి ఆదివారం శ్రీకాకుళం, విశాఖ, మన్యం, విజయనగరం జిల్లాల నుంచి రాయగడ మజ్జిగౌరి ఆలయానికి భక్తులు వెళ్తుంటారు. ఇక్కడ లారీ కూరుకుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు చేరుకొని పక్కకు తప్పించి రాకపోకలు పునరుద్ధరించారు. – న్యూస్‌టుడే, కొమరాడ



కూలితే ప్రమాదమే!




బలిజిపేట మండల కేంద్రం శివారున ఉన్న గ్రామీణ పశువైద్య కేంద్ర భవనం నిరాదరణకు గురైంది. పైకప్పు కారిపోవడంతో విలువైన మందులు తడిసి పోతున్నాయి. శిథిలావస్థకు చేరడంతో కూలుతుందని సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అదనపు భవనం మంజూరు చేయాలని కోరుతున్నారు. దీనిపై బలిజిపేట పశువైద్యాధికారి జి.గణేష్ వద్ద ప్రస్తావించగా.. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.
– న్యూస్‌టుడే, బలిజిపేట

షెడ్డు వినియోగిస్తే మేలు

వీరఘట్టం మండలం కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో రేకుల షెడ్డు నిరుపయోగంగా ఉంది. పైకప్పు రేకులు దెబ్బతినడంతో ఇలా వదిలేశారు. కొత్తవి ఏర్పాటుచేసి సైకిల్ షెడ్‌కు వినియోగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుతం సైకిళ్లు ఆరుబయట ఎండ, వానలో వదిలేస్తున్నామని, పాడవుతున్నాయని చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వై.లక్ష్మీ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం



సౌరవిద్యుత్తు ట్యాంకు నిరుపయోగం



సీతంపేట మండలం గెడ్డగూడలోని సౌర విద్యుత్తు మంచి నీటి పథకం కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారింది. సోలారు పని చేయకపోవడంతో దీని స్థానంలో విద్యుత్తు మోటారు అమర్చి గ్రామస్థులకు తాగునీరు అందిస్తున్నారు. ఇది కూడా మరమ్మతులకు గురవడంతో అలంకారప్రాయంగా మారింది. గ్రావిటేషన్ ఫ్లో ద్వారా వచ్చే గెడ్డ నీరు వర్షాల కారణంగా బురదమయంగా మారింది. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ పాపారావు మాట్లాడుతూ.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

(c) eenadu